విద్యతోపాటు పౌష్టికాహారం


వామన్‌పల్లిలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు


అమరవాయిలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎం నరేష్

గద్వాల (ధరూరు): విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పరిశుభ్ర ఆహారాన్ని అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని వామన్‌పల్లి, ద్యాగదొడ్డి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. బుధ, శుక్రవారాల్లో విధిగా గుడ్డు అందించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గద్వాల(గట్టు): పాఠశాల విద్యార్థులకు శుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ నల్లారెడ్డి వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మాచర్ల ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలననారు. హెచ్‌ఎం మధ్యాహ్న భోజన తయారుపై దృష్టిని సారించాలని సూచించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాచర్ల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నల్లారెడ్డి

గద్వాల (మల్దకల్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జీహెచ్‌ఎం నరేష్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం అమరవాయి హైస్కూల్లో కాంప్లెక్స్ పరిధిలోని 20 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, వంట నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

గద్వాల(మల్దకల్): ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణ స్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రవిచారి, నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు, వాల్మీకి పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

‘కృత్రిమ గర్భధారణ చేయించాలి’


పశు వైద్య శిబిరంలో అధికారులు

ఉండవెల్లి: పాడి రైతులు పశువులకు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించాలని జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని కంచుపాడు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. శిబిరంలో మొత్తం 37 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శిరీష, శంకరయ్య, వెంకట్రాజు, సిబ్బంది శివ, కృష్ణ, గోపాల మిత్ర సూపర్‌వైజర్ సూర్యారెడ్డి, సవరయ్య, ప్రకాష్, లోకేష్, గ్రామ పాడిరైతులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే తల పగులగొట్టారు

గద్వాల(ధరూరు): తన పొలంలోని మట్టిని ఎందుకు తరలిస్తున్నారని ప్రశ్నించినందుకు కొందరు తన తల పగులగొట్టారని రైతు కుర్వ వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి వివరాలు.. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని మన్నాపురం గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ పొలం వద్ద గుంత ఏర్పాటు చేసి అదే గ్రామానికి చెందిన కాప కృష్ణ పొలంలోకి మట్టిని తరలిస్తున్నారు. మా పొలంలోని మట్టిని మీరు ఎందుకు తరలిస్తున్నారని ప్రశ్నించడంతో కాప కృష్ణ, పవన్, అరవింద్, ప్రవీణ్ తదితరులు మూకుమ్మడిగా తనపై దాడి చేశారని ఆరోపించారు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.


గద్వాల జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుర్వ వెంకటేష్

క్లుప్తంగా

పీహెచ్‌సీలో పర్యవేక్షణ కరువు



అయిజ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా నడుచుకుంటున్నారు. ఆస్పత్రిలో పట్టపగలే కొంత మంది సిబ్బంది ఆదమరిచి నిద్రిస్తున్నా అడిగేవారే లేరు. శనివారం పీహెచ్‌సీలో ఓజేటీలు (ఆన్‌జాబ్ ట్రెనింగ్ సిబ్బంది) ఇద్దరు టేబుల్‌పై ఆదమరిచి నిద్రిస్తున్నా వారిని ఎవరూ లేపకపోవడం విశేషం. ఇలాంటి సంఘటనలు పీహెచ్‌సీలో తరుచు జరుగుతూనే ఉన్నా అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై మెడికల్ ఆఫీసర్ విష్ణును వివరణ కోరగా వాళ్లు నిద్రిస్తున్నది గమనించ లేదని తెలిపారు. మెమోలు జారీ చేసి జిల్లా కోఆర్డినేటర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

3న తెలంగాణ యూత్ డే



గద్వాల : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమరుల స్ఫూర్తిని మరచి పాలన కొనసాగించిందని టీజేఎస్ విద్యార్థి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మధు, ఆర్గనైజరింగ్ కోఆర్డినేటర్ భద్రప్ప అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ మలిదశ అమరుడు శ్రీకాంతచారి వర్ధంతి సందర్భంగా ఈనెల 3న (డిసెంబర్ 3) హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో తెలంగాణ యూత్ డే సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూత్‌డే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, రాజు, వివిధ మండలాల అధ్యక్షుడు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అయిజ: మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాల మల్లికార్జున్ కోరారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు తలపెట్టిన సింహగర్జన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలో మాలమహానాడు నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల మహా సంగ్రామ సభకు మాలలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరాజ్, వీరన్న, వీరేష్, నాగరాజు, లక్ష్మన్న, రంగన్న, నరసింహులు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన



ఇటిక్యాల: మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరై పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ భీమ్‌సేన్‌రావ్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన గొప్పవరమన్నారు. పౌర హక్కులను కాపాడి ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించేలా పౌర హక్కులు అవకాశం కల్పించాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహేష్, నాయకులు పాల్గొన్నారు.

‘కార్యకర్తలకు కూడా నచ్చడం లేదు’

రాజోళి: సీఎం రేవంత్ రెడ్డి పాలన కాంగ్రెస్ కార్యకర్తలకు కూడా నచ్చడం లేదని బీజేపీ మండలాధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. శనివారం సీఎం సభకు వెళ్తున్న అన్ని వాహనాలు ఖాళీగానే దర్శనమిచ్చాయని, దానిని బట్టే కాంగ్రెస్ నాయకులకు తమ పార్టీకి ఎంత ప్రజాబిమానం ఉందో తెలుస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల అమలను తుంగలో తొక్కి, అసంపూర్తిగా రుణమాఫీ, పత్తా లేని రైతు భరోసాలతో ప్రజలే కాకుండా పార్టీ కార్యకర్తలు కూడా విసిగిపోయారన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రజలకు నచ్చే విధంగా పాలన చేయాలని డిమాండ్ చేశారు.

ఆవుల అక్రమ రవాణా



మానవపాడు: అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకుని కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని జల్లాపురం శివారు ప్రాంతంలో శనివారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న కథనం ప్రకారం... హైదారాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తుండగా మానవపాడు మండలం జల్లాపురం శివారు ప్రాంతంలో లారీలో తరలిస్తున్న 19 ఆవులు, 3 దూడలను పట్టుకున్నారు. అనంతరం పోలీస్‌లకు సమాచారం అందించినట్లు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజోలి ఎస్‌ఐ జగదీష్, హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న ఆవులను గోశాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంప్



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలోని రైతు వేదికలో వీఎస్‌టీ సంజీవని, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 168 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివ కుమార్, మేనేజర్ హరిప్రసాద్, ఫార్మసిస్ట్ రమ్య, నిరంజన్, హాజీ బాషా, ఆశాలు, పంచాయతీ కార్యదర్శి బాలరాజు పాల్గొన్నారు.

వేసెక్టమిపై అపోహలు వీడండి



అయిజ: సంతాన నిరోధానికి పురుషులు వేసక్టమి ఆపరేషన్ చేయించుకోవడానికి అపోహలు వీడాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేసెక్టమిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎక్కువగా మహిళలే చేయించుకుంటున్నారని, పురుషులు సైతం చేయించుకోవాలని కోరారు. ఆపరేషన్ అనంతరం ఎప్పటిలాగే ఎలాంటి పనులైనా చేసుకోవచ్చని, ఎలాంటి అనర్థాలు జరుగవన్నారు. వేసక్టమి చేయించుకున్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

సకల దేవతలను పూజించినట్లే

శాంతినగర్ : గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని గో సేవా ప్రచారక్ గాయత్రి శ్రీనివాసులు, మాణిక్యం వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమావాస్య పర్వదినం సందర్భంగా శనివారం సాయంత్రం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవులో సకల దేవతలు కొలువై ఉంటారన్నారు. గోవును బాధపెడితే మహాపాపం చేసిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు, గోప్రచారక్‌లు, భక్తులు పాల్గొన్నారు.

కొండ చిలువ కలకలం

మానవపాడు: మండల కేంద్రంలో తెల్లవారుజామున పెద్దకాలువ డీ–31వద్ద రోడ్డుపై కొండచిలువ కలకలం రేపింది. కొండ చిలువ రోడ్డు దాటుతుండగా వాటి దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు. కొండచిలువను పట్టుకోవాలని అధికారులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శాంతినగర్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి మిథున్ తేజ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మిథున్ తేజ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన ఉండాలన్నారు. కుటుంబానికి, సమాజానికి అన్యాయం జరిగితే స్పందించాలన్నారు. కార్యక్రమంలో అలంపూర్ కోర్టు బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ సురేష్, అడ్వకేట్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు జీవన్, సామేలు, నాగశేషన్, శేషమ్మ, లక్ష్మీదేవి, చెన్నారెడ్డి, మద్దిలేటి, రామాంజనేయులు, నబి రసూల్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవపాడు: చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సమస్యలు పరిష్కరించుకోవడం సులభమవుతుందని జూనియర్ సివిల్ జడ్జి మిథున్ తేజ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు, అత్యాచార ఘటనలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు చదువుకునే వయస్సులో తప్పటడుగులు వేస్తే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ సురేష్, న్యాయవాదులు, ఎంఈఓ శివప్రసాదు, ఎస్‌ఓ అనురాధ, టీచర్లు పాల్గొన్నారు.


శాంతినగర్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మిథున్ తేజ

మోసం చేసినందుకు సంబరాలా ?

గద్వాల : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసినందుకు సంబరాలు చేసినందుకు సంబరాలు చేయాల్నా అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రైతుబంధు తీసుకొచ్చి రైతు బాంధవుడిగా నిలిచారన్నారు. ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్ పేరిట రైతులకు అనేక హామీలతో కల్లిబొల్లి మాటలు చెప్పి రైతుల ఓట్లు దండుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను నట్టేట ముంచిందన్నారు. రూ.49,500వేల కోట్లు రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ.17,934వేల కోట్ల రుణమాఫీ చేశారన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వీటిని పక్కదారి పట్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి రైతు పండుగ అని చెబుతూ సంబురాలు చేయడం సిగ్గుచేటన్నారు. అదే విధంగా బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మక్బూల్, బీచుపల్లి, ప్రతాప్, తిమ్మప్ప, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ప్రసవాల సంఖ్య పెంచాలి

గద్వాల(మల్దకల్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని డాక్టర్ స్వరూప రాణి వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు నెల నెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ స్వరూప రాణి

రైతు పండుగకు తరలిన నాయకులు


ఇటిక్యాల నుంచి బయలుదేరుతున్న నాయకులు


ధరూరు నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు.


అయిజ నుంచి మహబూబ్‌నగర్‌కు బయలుదేరుతున్న మహిళలు


ఎర్రవల్లిలో రైతు పండుగకు వెళ్లే బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు పండుగ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బస్సులు, ట్రాక్టర్లు, ఆటోల్లో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వేలాది మందితో సభా ప్రాంగణం కనుల పండుగగా ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్లా హనుమంతు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఇటిక్యాల కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రుక్మాందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, భాస్కర్, రాజు, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు శనివారం అందజేశారు. రాజోలి మండల కేంద్రానికి చెందిన జయలక్ష్మి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10,500 చెక్కును కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వావిలాల రంగారెడ్డి, జయన్న తదితరులు పాల్గొన్నారు.

పనులు చేస్తున్నా జీతం వస్తలేదు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గదులను శుభ్రం చేస్తూ, వంట చేస్తున్న మహిళ ఖైరున్ బీకి రెండేళ్లుగా స్కావెంజర్ బిల్లు పడలేదని.. ఇప్పటికీ ఒక నెల జీతం మాత్రమే పడిందని తెలిపారు. అధికారులు మారుతున్నా జీత భత్యం లేకుండా పనిచేస్తున్నాని ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ జీతం మంజూరు చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 6 వ తరగతి చదువుతున్న తస్లీమా 600 మీటర్ల అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎలిజబిత్ సుహాసిని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పీఈటీ అరుణతారా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మదనాపురం: మండలంలోని తిర్మలాయపల్లి గ్రామ సమీపంలో శనివారం పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కేజీబీవీ స్కూల్ వద్ద పట్టుకున్నారు. అనుమతి పత్రాలు చూపకపోవడంతో యాజమాని గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జీవించారు



అయిజ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పౌరహక్కుల సంఘం నాయకుడు పురుషోత్తం జీవించారని పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్ అన్నారు. మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామంలో అమరవీరుల స్థూపం వద్ద శనివారం పురుషోత్తం 24వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం నాయకుడు రాఘవాచారి మాట్లాడుతూ.. పురుషోత్తం విద్యార్థి దశ నుంచి చనిపోయేంతవరకు కూడా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సమాజ నిర్మాణం కోసం కృషి చేశారని కొనియాడారు. పౌర హక్కుల ఉద్యమంలో పనిచేస్తున్న క్రమంలో హైదరాబాద్ నడిబొడ్డులో ఆయన్ను దారుణంగా హత్య చేశారని వాపోయారు. కార్యక్రమంలో కవి, రచయిత నాగేశ్వరాచారి, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, హైకోర్టు న్యాయవాదులు స్వేచ్ఛ, గౌతమ్, ప్రభాకర్, మహదేవ్, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి

గద్వాల(గట్టు): ప్రభుత్వంతో పాటు అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. శనివారం గట్టు ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా పాఠశాలలను పీడీఎస్‌యూ నాయకులు సందర్శించి, మధ్యాహ్న భోజాన్ని పరిశీలించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కలుషిత ఆహారంతో విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్న సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంరెడ్డి, వీరేష్, శ్రీనివాస్, అంజి, తిరుమలేష్, వీరేష్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి దారి ఏర్పాటు చేయాలి



అయిజ: అంబ భవానీ ఆలయానికి దారి ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఏఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలోని అంబ భవానీ ఆలయం ముందు నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయడంతో రోడ్డు ఎత్తుగా మారిందని, దానివలన ఆలయానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందన్నారు. ఆలయం వరకు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపినాథ్, రఘు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.